క్లుప్తంగా

కరాటేలో గోల్డ్ మెడల్స్



గార్ల: ఆల్‌స్టైల్ మార్షల్ ఆర్ట్స్ కరాటే పోటీల్లో గార్లలోని నిర్మలా హైస్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి ఆరు గోల్డ్‌మెడల్స్ సాధించారు. ఖమ్మంలోని షాదీఖానాలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో వివిధ ఏజ్ కేటగిరీల్లో ఆరు పతకాలు సాధించారు. ఈసందర్భంగా విద్యార్థులను గార్ల–బయ్యారం సీఐ బి.రవికుమార్, ఎస్సై ఎస్‌కె.జీనత్‌కుమార్, ప్రిన్సిపాల్ సిస్టర్ జీన్సీ, కోచ్, ఉపాధ్యాయులు అభినందించారు.

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు

కొత్తగూడ: చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎఫ్‌ఆర్వో వజరహత్ హెచ్చరించారు. బుధవారం మండలకేంద్రంలోని పతంగులు విక్రయించే షాపులను తనిఖీ చేశారు. చైనా మాంజాతో వన్యప్రాణులు, పక్షులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఆయన వెంట డీఆర్‌ఓ కరుణ, ఎఫ్‌ఎస్వోలు రాజేష్, పద్మారావు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు మంజూరు

నెహ్రూసెంటర్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముకైన రైతులకు ప్రత్యేక కార్యాచరణ ద్వారా యుద్ధప్రాతిపదికన వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ జె.నరేష్ బుధవారం తెలిపారు. 1జనవరి 2024 నుంచి 31 డిసెంబర్ 2024 నాటి వరకు 3,256 వ్యవసాయ సర్వీసులను మంజూరు చేశామని, డిసెంబర్ నెలలోనే 611 సర్వీసులను అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో బుధవారం రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర సహాధ్యక్షుడు నాగుల భిక్షపతి తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా బొక్క వెంకన్న, ప్రధాన కార్యదర్శి డి. నగేష్, గౌరవ అధ్యక్షుడు ఎండీ. రంజాన్, రాష్ట్ర కౌన్సిలర్ మాడిశెట్టి సూర్యప్రకాష్, సహాధ్యక్షులుగా బలరాం, మోహన్, ఉపాధ్యక్షుడు టి.వీరభద్రం, మహిళా ఉపాధ్యక్షురాలు ఎం.మహేశ్వరి, అదనపు కార్యదర్శిగా ఎస్.దుర్గయ్య, కోశాధికారిగా శ్రీధర్ ఎన్నికయ్యారు.

క్రీడారంగానికి ప్రాధాన్యం




తొర్రూరు రూరల్: క్రీడా రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అరిపిరాల గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల ముగింపు ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులతోపాటు నగదును అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, నాయకులు సధాకర్, మల్లయ్య, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

108లో ప్రసవం

నర్సింహులపేట: మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన కారుపోతుల శ్రీలక్ష్మీ అనే గర్భిణికి బుధవారం పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌లో మహబూబాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో వాహనంలో పాపకు జన్మనిచ్చింది. సిబ్బంది రమేష్, దయాకర్‌లను గ్రామస్తులు అభినందించారు.

పరీక్షల భయం వదిలేయాలి



మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని పూర్తిగా వదిలేయాలని హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ట్రైనర్ రావుల యాదగిరి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో బుధవారం విద్యార్థుల మానసిక ఒత్తిడి తొలగించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పాక్కుల సదానందం, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ స్వాతి, కౌన్సిలర్ పర్వీనబేగం, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్

- ఆర్టీసీ స్థలంలో నర్సరీ కొనసాగింపు
- కంకర కుప్పలు.. ఆవరణ చుట్టూ చెత్తాచెదారం



సీరోలులో ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న కంకర కుప్పలు



బస్టాండ్ స్థలంలో ఏర్పాటు చేసిన నర్సరీ

కురవి: ఉమ్మడి కురవి మండలం నుంచి కొత్తగా సీరోలు మండలం ఏర్పడింది. సీరోలు మండల కేంద్రంలో అనేక ఏళ్ల నుంచి ఆర్టీసీ బస్టాండ్ ఉంది. బస్టాండ్‌కు సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో స్థలం ఉంది. ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1997 ఆగస్టు 16న సీరోలు గ్రామంలో ఆర్టీసీ బస్టాండ్‌ను అప్పటి ఎంపీ అజ్మీరా చందూలాల్, ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్‌లు ప్రారంభించారు. అప్పుడు బస్సులు సర్వీసులు ఉండడంతో బస్టాండ్ ప్రజలకు, ప్రయాణికులకు ఉపయోగపడేది. నేడు సీరోలుకు ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ మొత్తం ప్రైవేట్ వ్యక్తులకు ఆవాసంగా మారింది. ఆర్టీసీ బస్టాండ్‌లో ఎటు చూసినా కంకర కుప్పలు దర్శనమిస్తున్నాయి.

ఆర్టీసీ స్థలంలో నర్సరీ ఏర్పాటు..

బస్టాండ్ ఉపయోగంలో లేకపోవడంతో గ్రామ పంచాయతీ అధికారులు ఆర్టీసీ స్థలంలో నర్సరీని ఏర్పాటు చేసి నిర్వహణ సాగిస్తున్నారు. బస్టాండ్ ఆవరణలో కంకర కుప్పలు కనిపిస్తున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ స్థలం అన్యాక్రాంతం కాకుండా ఉండాలంటే ఆవరణ చుట్టు ప్రహరీ నిర్మాణం చేయాల్సి ఉంది. ఆర్టీసీ అధికారులు స్థలాన్ని పరిశీలించి ప్రహరీ నిర్మిస్తే స్థలం మరింత ఉపయోగంలోకి వస్తుంది. సీరోలుకు ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరిస్తే బస్టాండ్ వినియోగంలోకి వస్తుంది.

గిరిజన డిక్లరేషన్ అమలు చేయాలి

- సేవాలాల్ సేన వ్యవస్థాపకుడు ప్రేమ్‌చంద్‌నాయక్



నియామక పత్రం అందజేస్తున్న ప్రేమ్‌చంద్‌నాయక్

నెహ్రూసెంటర్: గిరిజనుల అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సేవాలాల్ సేన వ్యవస్థాపకుడు ప్రేమ్‌చంద్‌నాయక్ డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలో సంఘ సమావేశం దేవేందర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల రిజర్వేషన్ల తొలగింపు, జీఓ నంబర్ 3రద్దు చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. జనాభా దామాషా ప్రకారం గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. జాతి అభివృద్ధి కోసం ఇప్పటికే 9 జిల్లాలో మొదటి విడత యాత్ర పూర్తి చేశామని, ఈనెల 25వ తేదీ రెండో విడత యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుగులోత్ సీతారాంనాయక్, జిల్లా ఉపాధ్యక్షుడిగా గుగులోత్ గాంధీనాయక్‌ను నియమిస్తున్నట్లు నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూక్య రవి రాథోడ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు లకావత్ పద్మ, ప్రధాన కార్యదర్శి గుగులోత్ శాంతి, జిల్లా అధ్యక్షుడు గుగులోత్ చిట్టిబాబునాయక్ పాల్గొన్నారు.

12న ముగ్గుల పోటీలు

గార్ల: ఐద్వా, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈనెల 12న గార్లలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఐద్వా మండల అధ్యక్షురాలు ఎం.నాగమణి తెలిపారు. బుధవారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పోటీలను స్థానిక అంబేడ్కర్ విగ్రహ ప్రాంగణంలో ఈనెల 12 ఉదయం 10గంటలకు ప్రారంభమవుతాయని, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, కమిషనర్ రవీందర్ బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్, వివేకానంద విగ్రహం సమీపంలో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, డీఈ ఉపేందర్, రజక సంఘం అధ్యక్షుడు దుగ్గి గోపాల్, నిమ్మల శ్రీనివాస్, కర్పూరపు గోపి, డాలగర్ శంకర్, అంబాల శివకుమార్ పాల్గొన్నారు.

పాఠశాలను పునఃప్రారంభించాలి

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా సిరోల్ మండలంలోని కొత్తూరు(సీ) గ్రామం పరిధిలోని గుజిలితండాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పునఃప్రారంభించాలని కాంగ్రెస్ నాయకులు డీఈఓ రవీందర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. నాయకులు వేణు, శ్రీనువాస్, హదారాం పాల్గొన్నారు.

వీరారం హైస్కూల్‌లో మాక్ గ్రామసభ



మాక్ గ్రామసభలో పాల్గొన్న విద్యార్థులు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం వీరారం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులు మంగళవారం మాక్ గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులే సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శి, వార్డు సభ్యులు, మరికొందరు గ్రామ ప్రజలుగా వ్యవహరించారు. గ్రామంలోని పలు సమస్యలపై సభలో చర్చించి వాటి పరిష్కారానికి సభలో తీర్మానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ సైదులు మాట్లాడుతూ.. మోడల్ గ్రామసభ లాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు స్థానిక పాలనపై పూర్తి అవగాహన కల్పించవచ్చన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై విద్యార్థుల్లో ఉప్పటి నుంచి అవగాహన కల్పించడంపై కృషి చేసిన సాంఘిక ఉపాధ్యాయుడు రవిని అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనిర్మల, ఉపాధ్యాయులు మధు, జానకీ, మర్రెడ్డి, వెంకటయ్య, అనిల్‌కుమార్, వెంకన్న, మధుబాబు, రవీందర్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం పంటల గిట్టుబాటు ధరల సమగ్ర చట్టం అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు నల్లచట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జడ సత్యనారాయణ, నందగిరి వెంకటేశ్వర్లు, గుజ్జు దేవేందర్, ఊడుగుల లింగన్న, బానోత్ నరసింహా, చిర్రయాకన్న, గజ్జి లింగన్న, అద్దూరి వెంకన్న, తోకల వెంకన్న, చింత వెంకన్న, రామచంద్రు, మురళీకృష్ణ, హలావత్ లింగన్న, పర్వత కోటేష్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం



ఇంటిలో దగ్ధమైన సామగ్రి

గూడూరు: మండలంలోని మట్టెవాడలో ఓ రైతు పెంకుటిల్లు బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితుడు బిజ్జె సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం సత్యనారాయణ పాడి పశువులు కొట్టుకొని పోగా, భార్య కూలీ పనులకు వెళ్లింది. మధ్యాహ్నం ఒక్కసారిగా ప్రమాదవశాత్తు ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. కొద్ది దూరంలో ఉన్న పాఠశాల ఉపాధ్యాయులు చూసి వెంటనే అరుపులతో వీధివాసులకు సమాచారం అందించారు. చుట్టు పక్కల వారు బిందెలతో నీళ్లు పోసి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న బియ్యం, వస్తువులు, పట్టాదారు పాస్, బ్యాంకు కాగితాలు, నగదు మొత్తం కాలి బూడిదయ్యాయి. ఇల్లు కట్టుకోవడానికి దాచుకున్న సుమారు రూ.లక్షకు పైగా డబ్బులు కాలిపోయాయని బోరున విలపించాడు. బాధితుడిని ప్రభుత్వ ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

బైక్‌లు ఢీ.. నలుగురికి తీవ్రగాయాలు

గార్ల: ఎదురెదురుగా వెళ్తున్న రెండు మోటార్ బైక్‌లు ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్రగాయాలైన సంఘటన గార్ల–సీతంపేట మార్గమధ్యంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్లకు చెందిన ఉప్పలయ్య, నవీన్, ఉపేందర్‌లు సీతంపేట గ్రామం నుంచి గార్లకు బైక్‌పై వస్తుండగా, బయ్యారం మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన దేవేందర్ గార్ల ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న నిహారికను బైక్‌పై ఇంటికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈఘటనలో గార్లకు చెందిన ముగ్గురు వ్యక్తులకు, నిహారికకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన గార్ల సీహెచ్‌సీకి తరలించి చికిత్స జరిపిస్తున్నారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి

పెద్దవంగర: పురుగుల మందు తాగి ఓ రైతు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంట్లకుంట గ్రామానికి చెందిన కన్నె శ్రీధర్(39) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 4న రోజువారీగా వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లిన రైతు పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం వరంగల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతికి గల వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..

కొత్తగూడ: మద్యం మత్తులో పడుకొని నిద్రలోనే గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలకేంద్రంలో బుధవారం వెలుగు చూసింది. ఎస్సై కుశకుమార్ తెలిపిన వివరాల ప్రకారం షేక్ బాషా(60) అనే వ్యక్తి మండలకేంద్రంలో కూలీగా పని చేస్తున్నాడు. ఎవరు అడిగిన తన వ్యక్తిగత వివరాలను తెలిపే వాడు కాదు. బాషా మద్యానికి బానిస అయ్యాడు. మంగళవారం రాత్రి మద్యం మత్తులో వెంకయ్య మేస్త్రీ ఇంటి సమీపంలో పడుకుని నిద్రలోనే మృతి చెందాడు. ఎప్పుడు అడిగినా తన స్వగ్రామం మంచిర్యాల అని మాత్రమే చెప్పేవాడని స్థానికులు అంటున్నారు. వెంకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహన్ని మార్చురీకి తరలించినట్లు ఎస్సై తెలిపాడు. ఎవరైనా మృతుడి బంధువులు ఉంటే 87126 56964 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

ప్రజాపాలన అంటే దాడులు చేయడమా?

- బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి రాంబాబునాయక్



గూడూరు: మాట్లాడుతున్న రాంబాబు

గూడూరు: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చమని అడిగే ప్రతిపక్షాలపై దాడులు చేయడమే కాంగ్రెస్ పార్టీ నైజమా అని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి రాంబాబునాయక్ విమర్శించారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని ఆయన ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, ప్రజల దృష్టిని మళ్లించడం కోసం ఏదో ఒక కుట్ర పూరిత ప్రయత్నాలు చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వంలో అధికారంలో ఉన్న బీజేపీ కార్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ హోదాతో దాడులకు పాల్పడితే కేంద్రం తీసుకోబోయే చర్యలు ఎలా ఉంటాయో తెల్సుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు రాసమల్ల వెంకన్న, బత్తుల లక్ష్మణ్, పడాల నాగరాజు, చెల్పూరు రాజు, కోరె అనిల్ పాల్గొన్నారు.

దాడి హేయమైన చర్య

నెల్లికుదురు: హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంపై రాళ్లు, కర్రలతో దాడి చేయడం హేయమైన చర్య అని, దాడిని నిరసిస్తూ బుధవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో మండల బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో నాయకులు యాకిరెడ్డి, చందు రాజు, పాపారావు, సురేష్, నవీన్, రమేశ్, యాకయ్య, లక్ష్మణ్, మనోజ్, రాజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డితో నడుద్దాం..

- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవి



మాట్లాడుతున్న పిడమర్తి రవి

మహబూబాబాద్ అర్బన్: సీఎం రేవంత్‌రెడ్డితో నడుద్దాం.. ఎస్సీ వర్గీకరణ సాదిద్దామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పిడమర్తి రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. మూడు దశాబ్దాల కాలంగా ఎస్సీ వర్గీకరణ ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఏ ఒక్క ఆగ్రవర్ణం నాయకుడు ఉద్యమం చేయకుండానే 2శాతం జనాభా లేని ఆగ్రవర్ణాలకు బీజేపీ ఆగ్రవర్ణ పేదల పేరుతో 10శాతం రిజర్వేషన్లు కల్పించి పార్లమెంట్‌లో చట్టం చేసిందన్నారు. అటువంటి మనువాద బీజేపీకి ఎమ్మార్పీస్ అగ్ర నాయకుడు మద్దతు తెలిపి మాదిగ ఓట్లు వేయిచడం దారుణమన్నారు. ఫిబ్రవరి 2న మాదిగ సంఘాల ఆధ్వర్యంలో మాదిగ విద్యార్థి యువగర్జన సభను ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహిసున్నామని, దీనికి వేలాదిగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు మొలకల నరేష్, దర్శనం రామకృష్ణ, ఇనుగుర్తి సుధాకర్, పోలేపాక వెంకన్న, కంపాటి ఉప్పలయ్య పాల్గొన్నారు.

గోదాదేవి నీరాటోత్సవాలు

మహబూబాబాద్ రూరల్: ధనుర్మాస వ్రత మహోత్సవ పూజల్లో భాగంగా పట్టణంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో గోదాదేవి అమ్మవారి (పెళ్లి కుమార్తెను చేసే వేడుక) నీరాటోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారి మంగళాశాసనాలతో తిరుమల తిరుపతి దేవస్థాన పరిధిలోని ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు వారి సౌజన్యంతో ధనుర్మాస వ్రత మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అర్చకులు శ్రీమాన్ భాగవతుల వంశీకృష్ణమాచార్య స్వామి, సత్యం గౌతమ్ మహారాజ్ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో గోదాదేవి అమ్మవారి నీరాటోత్సవాలు జరుగుతున్నాయి.

ఆర్థికసాయం

కేసముద్రం: మండలంలోని సప్పిడిగుట్టతండా జీపీకి చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్న సపావట్ రేణుక అనే నిరుపేద విద్యార్థినికి, ఎన్‌ఎఫ్‌హెచ్‌సీ ఫౌండేషన్ సహకారంతో అమెరికాలో ఉంటున్న దారావత్ మోతిలాల్ అనేవ్యక్తి రూ.12వేల ఆర్థికసాయాన్ని బుధవారం ఆన్‌లైన్ ద్వారా అందజేసినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మోహన్ తెలిపారు.

వాహనాల తనిఖీ

గూడూరు: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని సీఐ బాబూరావు హెచ్చరించారు. మండల కేంద్రంలో బుధవారం డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

రెమ్యునరేషన్ చెల్లించాలి

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో విధులు నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్‌ను వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు సురేందర్ డిమాండ్ చేశాడు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ క్రాంతికి సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి నర్సింహరాజు, కార్యదర్శి నర్సయ్య, రమేష్, భాస్కర్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కురవి: మండల కేంద్రానికి చెందిన దళిత నాయకుడు కిన్నెర మల్లయ్యకు సావిత్రిబాయి పూలే ఎక్సలెంట్ జాతీయ అవార్డు రావడంతో పలువురు బుధవారం కురవిలో సన్మానం చేశారు. టీయుడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రవినాయక్, భాస్కర్, విజయ్, వెంకన్న, సూర్యనాయక్, తదితరులు సన్మానించారు.

విద్యుత్ మోటార్ల చోరీ

కురవి: మండలంలోని రాజోలు శివారు స్టేషన్‌గుండ్రాతిమడుగు గ్రామంలో మంగళవారం రాత్రి వ్యవసాయ బావుల విద్యుత్ మోటార్లు చోరీకి గురైనట్లు బాధిత రైతులు మాలోత్ మోతీలాల్, తునగర్ రాజేశ్ బుధవారం తెలిపారు. వ్యవసాయ బావుల వద్ద ఉన్న విద్యుత్ మోటార్లను ధ్వంసం చేసి ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. సుమారుగా రూ.60వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

భజనతండా జీపీ ఏర్పాటుపై తీర్మానం

మహబూబాబాద్ రూరల్: మండలంలోని అయోధ్య గ్రామ పరిధిలోని భజన తండాను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని తీర్మానించారు. తహసీల్దార్, అయోధ్య గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి భగవాన్ రెడ్డి సమక్షంలో స్థానిక జీపీ కార్యాలయంలో గ్రామసభ బుధవారం నిర్వహించారు. ఈ సభలో కార్యదర్శి శ్రీలత, పీఏసీఎస్ డైరెక్టర్ జినుక నాగన్న, దుండి శ్రీను, భూక్య చిరంజీవి పాల్గొన్నారు.

సన్మానం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల గ్రామానికి చెందిన తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు దేశెట్టి ప్రవీణ్ కుమార్‌ను జిల్లా సమాచార సంబంధాల శాఖ అధికారి రాజేంద్రప్రసాద్ బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి గాయకులు గిద్దె రాంనర్సయ్య, కొమిరె వెంకన్న, బండ వెంకన్న, డప్పు శ్రీను, ఐలేష్, సురేష్, జిన్నా పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

మరిపెడ: కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీపై బీజేపీ నేత రమేష్ బిధూడీ చేసిన అనుచిత వ్యాఖ్యలు స్త్రీ జాతికే అవమానమని కాంగ్రెస్ డోర్నకల్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు శాగంటి సందీప్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బస్టాండ్ సమీపంలో రమేశ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు అఫ్జల్, వెంకటేశ్వర్లు, చిర్ర సునీల్, అవినాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం

గార్ల: పశువుల్లో కృత్రిమ గర్భధారణ చేయించడం ద్వారా మేలుజాతి ఆడ దూడలు పుడుతాయని, దీంతో రైతులకు ఎంతో లాభదాయకం అని పశువైద్యుడు వి.సురేష్ అన్నారు. బుధవారం మండలంలోని గోపాలపురం గ్రామంలో పశుసంవర్ధక శాఖ మహబూబాబాద్ ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరం నిర్వహించారు.

మాదిగ జేఏసీ మండల అధ్యక్షుడిగా శ్రీను

కురవి: మండలంలోని స్టేషన్‌గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన చెరకుపల్లి శ్రీను మాదిగ జేఏసీ కురవి మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. బుధవారం కురవిలో సంఘం వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి నియామకపు పత్రాన్ని శ్రీనుకు అందజేశారు.

ఆస్పత్రి పనులను ప్రారంభించాలి

పెద్దవంగర: మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి పనులను వెంటనే ప్రారంభించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రామచంద్రయ్యశర్మ, హరీశ్, భాస్కర్, పటేల్ నాయక్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మహబూబాబాద్ అర్బన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ కళాశాల్లో బుధవారం టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ క్రైం సీఐ వెంకటేష్, టౌన్ ఎస్సై విజయ్ పాల్గొన్నారు.

దాతలు సహకరించాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం మానుకోట మిత్ర వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంచినీటి నల్లాలు బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌శ్రీం సిరినాయక్, ఉపాధ్యాయుడు వాసుదేవ్, సంకా బద్రినారాయణ, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులకు పట్టాలు ఇవ్వాలని వినతి

నెల్లికుదురు: కేసముద్రం మండలం నారాయణపురం గ్రామ శివారులో ఉన్న ఆలేరు గ్రామ రైతుల భూములకు పట్టాలు ఇచ్చేవిధంగా చర్య తీసుకోవాలని హైదరాబాద్‌లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్‌తో కలిసి బుధవారం ఆలేరు రైతులు రాజేశ్వరి, శ్రీపాల్ వినతిపత్రం అందించారు.

భూనిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి

గార్ల: రైల్వే 3వ లైన్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ బుధవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌ను భూనిర్వాసితులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఎభూనిర్వాసితులు గౌని మల్లేష్, శ్రీరాములు, రవి, వెంకన్న, జయమ్మ, లక్ష్మీప్రసన్న, మంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌క్రైంపై అవగాహన కల్పించాలి

బయ్యారం: రోజురోజుకు పెరుగుతున్న సైబర్‌క్రైంపై విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించి జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై తిరుపతి అన్నారు. మండలంలోని గంధంపల్లి–కొత్తపేట ఉన్నత పాఠశాలలో సైబర్‌క్రైంపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మండల పాస్టర్స్ ఎన్నికలు ఏకగ్రీవం

కురవి: మండల కేంద్రంలోని మరనాత విశ్వాస సమాజం చర్చిలో బుధవారం మండల నూతన పాస్టర్స్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా ఆనంద్, అధ్యక్షుడిగా విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జాన్‌వెస్లీ, ఉపాధ్యక్షుడిగా హనోకు, జాయింట్ సెక్రటరీగా రాకేష్, కోశాధికారిగా కృపానందం, సభ్యులను ఎన్నుకున్నారు.

జాతీయస్థాయి ఫొటోగ్రఫీలో ప్రథమ బహుమతి



బహుమతి స్వీకరిస్తున్న యాని



బహుమతి దక్కించుకున్న ఫొటో

మహబూబాబాద్ రూరల్: జాతీయస్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఫొటోగ్రాఫర్ డప్పు యాని ప్రథమ బహుమతి సాధించాడు. హుస్సేన్ ఖాన్ 7వ జాతీయస్థాయి ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ ఒడిషా రాష్ట్రంలో ఈనెల 5, 6 తేదీల్లో జరిగింది. ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ హుస్సేన్ ఖాన్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడు.